# చెరుకు ఫ్యాక్టరీని మూసేసిందే కాంగ్రెస్

- ఇప్పుడు ఫ్యాక్టరీ గురించి జీవన్‌రెడ్డి మాట్లాడడం సిగ్గుచేటు
- అల్లీపూర్‌ను మండలం చేస్తాం
- సింగర్‌రావుపేటలో లోలెవెల్ వంతెనను ఆధునీకరిస్తాం
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్
- బీఆర్‌ఎస్ చేరిన అల్లీపూర్ వాసులు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

రాయికల్, అక్టోబర్ 26: ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీపై బీజేపీ, కాంగ్రెస్ నాటకాలు ఆడుతున్నాయని జగిత్యాల నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ విమర్శించారు. జిల్లాకు చెందిన జీవన్ రెడ్డి, రత్నాకర్‌రావు మంత్రులుగా ఉన్నప్పుడే చెరుకు ఫ్యాక్టరీని మూసివేశారని, నేడు జీవన్ రెడ్డి, రత్నాకర్‌రావు కొడుకు నర్సింగరావు చెరుకు ఫ్యాక్టరీ గురించి మాట్లాడడం సిగ్గుచేటు దుయ్యబట్టారు. రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన ఏఎంసీ డైరెక్టర్ అత్తినేని సాయిరెడ్డి ఆధ్వర్యంలో 15 మంది యువకులు గురువారం ఎమ్మెల్యే సమక్షంలో జగిత్యాలలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అల్లీపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు ఎంబారి వీరేశ్ పార్టీ చేరారు. వారికి సంజయ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో జరగని అభివృద్ధి, తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసి చూపించిందని స్పష్టం చేశారు. అన్నివర్గాల అభివృద్ధికి కృషి చేశామన్నారు. మోసపూరిత హామీలతో కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని నెరవేర్చక చేతులెత్తేశారని కర్ణాటకలో ప్రజలు ప్రభుత్వంపై తిరగబడుతున్నారన్నారు. జగిత్యాల నియోకవర్గంలో 25 వేల మందికి, అల్లీపూర్ గ్రామంలో 700 మందికి బీడీ పింఛన్ అందిస్తున్నామన్నారు. గడిచిన 9 ఏండ్లలోనే జగిత్యాలలో 9 గురుకులాలను ఏర్పాటు చేశామని, డిగ్రీ కళాశాలలు, వైద్య కళాశాలలు, నర్సింగ్ కళాశాలల వంటివి ప్రారంభించుకోవడంతో జగిత్యాల ఎడ్యుకేషనల్ హబ్‌గా మారిందన్నారు. రూ. 20 కోట్లతో పొలాస వ్యవసాయ కళాశాలను నిర్మించామన్నారు. రాబోయే బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అల్లీపూర్‌ను మండలం గా ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే సింగారావుపేట లోలెవెల్ వంతెనను ఆధునీకరిస్తామన్నారు.

### పసుపు రైతులపై కేంద్రానికి చిత్తశుద్ధి లేదు

పసుపు బోర్డుపై బీజేపీకి చిత్తశుద్ధి లేదని సంజయ్ విమర్శించారు. కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే పసుపు బోర్డు ప్రకటించిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరు వల్లే జిల్లాలో పసుపు సాగు 33 వేల ఎకరాల నుంచి నేడు 10 వేల ఎకరాలకు పడిపోయిందని వెల్లడించారు. రూ. 15 వేలు ఉన్న పసుపు ధర నేడు రూ.10 వేలకు పడిపోయిందని, కేవలం పసుపు బోర్డుతోనే సరిపెట్టకుండా పసుపునకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు రత్నాకర్ రావు, మండల కోఆప్షన్ సభ్యుడు ముఖీద్, ప్యాక్స్ చైర్మన్ రాజలింగం, పార్టీ మండల ఉపాధ్యక్షుడు మహేశ్, ఉప సర్పంచ్ సాగర్ రావు, ఆర్‌బీఎస్ కన్వీనర్ సత్యం, యూత్ అధ్యక్షుడు ప్రశాంత్, ఎంపీటీసీ మోర విజయలక్ష్మి-వెంకటేశ్, బీసీ సెల్ నాయకులు ఎంబారి వెంకటేశ్, గణపతి, సతీశ్, జగదీశ్, వేల్పుల ప్రవీణ్, రెండ్ల రా జం, వార్డు సభ్యులు ముదం శ్రీను, పోతు శ్రీను, నాయకులు మోహిద్, అమన్, సంజీవ్ రావు, భీమన్న పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌కు మద్దతుగా పద్మశాలీలు

బీఆర్‌ఎస్ పార్టీకి పద్మశాలీలు మద్దతుగా ఉంటారని ఆ సంఘం నాయకులు అన్నారు. అల్లీపూర్ గ్రామ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు శ్రీహరి, నాయకులు ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను జగిత్యాలలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పద్మశాలీ సంఘం అధ్యక్షుడిని ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు.

## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల రూరల్, అక్టోబర్ 26: పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన రిటైర్డ్ లెక్చరర్ కచ్చు భీమ లింగం భార్య అనారోగ్యంతో మృతి చెందగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గురువారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే చల్‌గల్ గ్రామానికి చెందిన వొగులపు మల్లేశ్ మృతి చెందగా అతడి కుటుంబ సభ్యులను జగిత్యాల ప్రభుత్వ దవాఖానలో పరామర్శించారు. మోతె గ్రామానికి చెందిన అత్తెన మల్లేశం తండ్రి కొమురయ్య మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను, చిత్రం ప్రకాశ్ 14 నెలల కూతురు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోరె గంగమల్లు, నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు

### 24 గంటల్లో 19.17లక్షల నగదు, 190లీటర్ల మద్యం సీజ్

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 26 ః అసెంబ్లీ ఎన్నికల నేపద్యంలో జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని, గడిచిన 24గంటల్లో జిల్లా వ్యాప్తంగా 10,17,000ల నగదు, రూ. 68వేల విలువ చేసే 190 లీటర్ల లిక్కర్, 1.44లక్షల విలువైన 72 బ్యాటరీ స్టవ్స్ పట్టుకుని గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించామని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల నేపద్యంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులను తీసుకెళ్తే పట్టుకుని చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని, సమాచారం తెలిసిన వారు డయల్ 100కుగాని సంబంధిత పోలీస్ స్టేషన్‌కు గాని సమాచారం అందించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

## జిల్లాలో 74 గుడుంబా కేసులు నమోదు

జగిత్యాల, అక్టోబర్ 26: జిల్లాలో ఎన్నికల కోడ్ అమలు అయినప్పటి నుంచి 74 గుడుంబా కేసులను నమోదు చేశామని జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 244 లీటర్ల గుడుంబాను, 110 కిలోల బెల్లం స్వాధీనం చేసుకొని, 16,680 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశామన్నారు. గుడుంబా రవాణాకు ఉపయోగించిన 5 వాహనాలను సీజ్ చేశామని, 15 బెల్ట్ షాపులు సీజ్ చేశామని, 15 మందిని అరెస్టు చేసి, 122.10 లీటర్ల లిక్కర్, 41 లీటర్ల బీర్ బాటిళ్లను సీజ్ చేశామని వివరించారు. ఎక్సైజ్ నేరాలకు పాల్పడకుండా 65 మందిని సంబంధిత తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశామని, సీజ్ చేసిన మద్యం విలువ రూ.20.60లక్షల వరకు ఉంటుందన్నారు. ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో కంట్రోల్ రూం నంబర్ 80191 08768 కు ఫోన్ చేసి తెలుపాలన్నారు. అలాగే జగిత్యాల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ 87126 58824, ధర్మపురి సీఐ 87126 58825, మెట్‌పల్లి సీఐ 87126 58826కు ఆయా నంబర్లలో ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని వివరించారు.

# రైతు బంధును అడ్డుకుంటారా..?

**రైతుబంధు సాయం పంపిణీని ఆపివేయాలంటూ కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలో ఈసీకి ఫిర్యాదు చేయడంపై రైతాంగం భగ్గుమంది. పెట్టుబడి సాయాన్ని అడ్డుకుంటారా అని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు జిల్లాలో పలుచోట్ల ఆ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేసింది.**



సారంగాపూర్ : సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ మేడిపెల్లి మనోహర్ రెడ్డి

సారంగాపూర్, అక్టోబర్ 26: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. రైతులకు పెట్టుబడి సాయం అందకుండా ఉండేందుకే కాంగ్రెస్ పార్టీ ఈసీ కి ఫిర్యాదు చేసిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా ప్రజల హృదయాల్లో సీఎం కేసీఆర్ చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిండి ఉన్నాయని, మూడోసారి కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందని, బీఆర్‌ఎస్ అభ్యర్థులకు భారీ మెజార్టీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్, రైతు బంధు సమితి మండల కన్వీనర్ కోల శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ లేటి నర్సింహా రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు జోగినపెల్లి సుధాకర్ రావు, పోతారం సర్పంచ్ ఢిల్లీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

రాయికల్, అక్టోబర్ 26: పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద కాంగ్రెస్ నాయకులు రైతు బంధు పథకాన్ని ఆపాలంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాయడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ శ్రేణులు ఆ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ రైతులను దగా చేసేందుకే రైతుబంధు పథకాన్ని ఆపాలని కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశాయని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, జడ్పీటీసీ జాదవ్ అశ్విని, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మారంపెల్లి రాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ రమాదేవి, కౌన్సిలర్లు మహేందర్, సాయి, కాంతారావు, మహేశ్ గౌడ్, కో ఆప్షన్ మెంబర్ సోహెల్ పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సారంగాపూర్, అర్టోబర్ 26: బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి గ్రామంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు రామకిష్టు సతీశ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు రామకిష్టు గంగాధర్, మండల యూత్ అధ్యక్షుడు గాజర్ల రాంచంద్రం గౌడ్, ప్రధాన కార్యదర్శి కొండపల్లి అజిత్ రావు, మండల యూత్ ఉపాధ్యక్షుడు సదాల అశోక్, నాయకులు చిక్రం రవీందర్, మురళి, రవి, రాజేశ్, రాజు, మహేశ్, వెంకటేశ్, ఆంజనేయులు, అగస్టిన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కారు గుర్తుకే ఓటెయ్యండి



29వ వార్డులో సంజయ్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న ఎంఐఎం అధ్యక్షుడు

జగిత్యాల రూరల్, అక్టోబర్ 26: పట్టణంలోని 29వ వార్డులో గురువారం జగిత్యాల నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కుమార్ తరపున జగిత్యాల ఎంఐఎం అధ్యక్షుడు యూనస్ నదీం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తున్నదని, జగిత్యాల ఎమ్మెల్యేగా డాక్టర్ సంజయ్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రచారం కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## ఆలయానికి విరాళం అందజేత

కొడిమ్యాల, అక్టోబర్ 26: మండల కేంద్రంలో నిర్మిస్తున్న శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా కరీంనగర్‌కు చెందిన కోడం సుశీల్ కుమార్ -రమ్య దంపతులు రూ.50,116 నగదును గురువారం విరాళంగా అందజేశారు. ఆలయ పూజారి నాగరాజు రమేశ్‌కు అందజేశారు.

## విద్యార్థుల భవిష్యత్ కోసం కృషి చేయాలి

సారంగాపూర్, అక్టోబర్ 26: విద్యార్థుల ఉజ్వ ల భవిషత్ కోసం అధ్యాపకులు తమవంతు కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి బీ నారాయణ అన్నారు. గురువారం బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శంచి రికార్డులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధ్యాపకులు నిరంతరం విద్యార్థుల ఉజ్వల భవిషత్ కోసం కృషి చేస్తూ బోధనలో కొత్త అంశాలను మెళవిస్తూ వారి ఉన్నతికి తోడ్పడాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.